క్లుప్తంగా

ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

కందుకూరు: స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ సరిత ఆధ్వర్యంలో ప్రిసైడింగ్ అధికారులకు మొదటి విడత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఎన్నికల సరళి, నిర్వహణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంఈఓ నర్సింహ, మాస్టర్ ట్రైనర్ శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.

పశువులకు గర్భకోశ నివారణ చికిత్స



పశువులకు చికిత్స చేస్తున్న వైద్యులు

కందుకూరు: మండల పరిధి లేమూరులో సోమవారం పశువర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు షైన్‌షేక్, ఎం.దీప్తి, ఎస్.సంధ్యారాణి 56 పాడి పశువులకు గర్భకోశ నివారణ, చూడి పరీక్షలు నిర్వహించి, చికిత్స అందించారు. 19 లేగదూడలకు నట్టల నివారణ మందులు వేశారు. 23 పెంపుడు కుక్కలకు యాంటీ రేబిస్ టీకా వేశారు. పాడి పశువులకు సకాలంలో చికిత్సలు అందించాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో సిబ్బంది జంగయ్య, రమేష్, కె.రమేష్ పాల్గొన్నారు.

బతుకమ్మ ఉత్సవాలకు మహిళలు



సరూర్‌నగర్‌కు వెళ్లిన మెప్మా సిబ్బంది తదితరులు

బడంగ్‌పేట్: ప్రభుత్వ ఆదేశాల మేరకు సోమవారం సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరగనున్న బతుకమ్మ సంబురాలకు మునిసిపల్ కార్పొరేషన్ నుంచి మహిళలు తరలి వెళ్లారు. అందుకోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బస్‌ను కమిషనర్ పి.సరస్వతి, మేనేజర్ శ్రీధర్‌రెడ్డిలు జెండా ఊపి ప్రారంభించారు. మెప్మా అధికారులు, కార్యాలయ సిబ్బంది సుమారు వంద మందిని స్టేడియానికి తరలించారు.

వాహనాల రాకపోకలు నిలిపివేత

తుక్కుగూడ: పుర పరిధి రావిర్యాల సూర్యగిరి ఎల్లమ్మ ఆలయానికి రావిర్యాల నుంచి రాకపోకలు నిలిపి వేశామని ఆలయ ఫౌండర్ ట్రస్టీ చైర్మన్ రెడ్డిగళ్ల రత్నం, ఈఓ మోహన్‌రావులు సోమవారం తెలిపారు. చెరువు నీటితో రోడ్డు పూర్తిగా మునిగి పోవడంతో భక్తులకు ఇబ్బంది కలగకుండా ఈ నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఎస్‌కేడీ నగర్ ముఖద్వారం ప్రారంభం



ముఖద్వారాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పరిధి శ్రీకృష్ణదేవరాయనగర్‌కాలనీలో నూతనంగా నిర్మించి శ్రీలక్ష్మీనర్సింహస్వామి దేవాలయం ముఖ ద్వారాన్ని సోమవారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ప్రారంభించారు. కటికరెడ్డి కృష్ణారెడ్డి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కటికరెడ్డి అరవిందరెడ్డి ముఖద్వారాన్ని నిర్మింపజేశారు. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి, కన్వీనర్ వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షులు కృష్ణారావు, సత్యనారాయణరెడ్డి, పుల్లారెడ్డి, రఘురామ్‌నేత, సుధాకర్‌రెడ్డి, అమరేందర్‌రెడ్డి, శ్రీధర్‌రావు, వెంకటరమణ,పాపారావు, నారాయణ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికలపై శిక్షణ

మంచాల: నిబంధనల మేరకు ఎన్నికల నియమావళిని అమలు పర్చాలని ఎంపీడీఓ బాల శంకర్ అన్నారు. సోమవారం మండల కార్యాలయంలో స్థానిక ఎన్నికల నిర్వహణపై ప్రిసైడింగ్ అధికారులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిబంధనలు, వాటి అమలు తీరుపై అధికారులకు అవగాహన కల్పించామని చెప్పారు. ఎంఈఓ రాందాస్ పాల్గొన్నారు.

'చెత్త'శుద్ధి శూన్యం!



మహేశ్వరం- మన్సాన్‌పల్లి రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

- పర్యవేక్షణ కొరవడి.. సమస్యలు పేరుకుపోయి
- అస్తవ్యస్తంగా ప్రత్యేకాధికారుల పాలన
- చుట్టపుచూపుగా గ్రామాలకు రాక
- అపరిశుభ్రంగా.. అధ్వానంగా రోడ్లు
- సమస్యల సుడిగుండలో పల్లెలు

మహేశ్వరం: పల్లెల్లో ప్రత్యేకాధికారుల పాలన పడకేసింది. పంచాయతీ పాలక వర్గాల పాలన ముగిసిన అనంతరం.. గ్రామాల పాలన అప్పగిస్తూ.. జిల్లా, డివిజన్, మండల, పంచాయతీ అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వీరు పల్లెలను పట్టించుకోకుండా.. సొంత శాఖ పనులకే పరిమితం అయ్యారు!

గ్రామసభలు లేవు

ప్రభుత్వం నియమించిన ప్రత్యేక అధికారులు.. పంచాయతీలు, మండలాలు, డివిజన్ల అధికారులను సమన్వయం చేసుకుంటూ నిత్యం గ్రామాల్లో సందర్శించాలనే ఉన్నతాధికారుల ఆదేశాలు ఉన్నాయి. కానీ వీరిపై ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేని కారణంగా వారు.. పల్లెలను నిర్లక్ష్యం చేస్తున్నారు. ఏదో చుట్టపు చూపుగా రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసి, సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పంచాయతీరాజ్ చట్టం సెక్షన్ 46 ప్రకారం ప్రతి రెండు నెలలకు ఒకసారి పంచాయతీలో గ్రామ సభలను నిర్వహించాలి. స్థానికులను భాగస్వామ్యం చేస్తూ చేపట్టాల్సిన అభివద్ధి, సంక్షేమ పనులతో పాటు.. ప్రజా సమస్యలపై గతంలో చేసిన పనులపై చర్చించాలి. కానీ.. ప్రత్యేకాధికారులు ఇవేమీ చేయడం లేదన్న ఆరోపణలు వస్తుండగా.. అధికారుల వాదన మరోలా ఉంది. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని, పన్నుల రూపంలో వచ్చిన డబ్బు అంతంత మాత్రమే ఉండడంతో ఎటూ సరిపోవడం లేదు. తాగునీరు, పారిశుద్ధ్య పనులతో పాటు ఇతర అత్యవసర పనులకు తమ సొంత నిధులు వెచ్చిస్తున్నామని పేర్కొంటున్నారు.

కార్యాలయానికే పరిమితం

మండలంలోని 30 పంచాయతీలకు ఒక్కో గ్రామానికి ఒక్కో ప్రత్యేకాధికారిని నియమించారు. మండలం, నియోజకవర్గానికి నియమించింది. కాగా.. పంచాయతీలకు ప్రత్యేకాధికారులు సరిగా రావడం లేదు. వారు తమ సొంత కార్యాలయాలకే పరిమితమవుతున్నారు. ఇటీవల ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పథకం కొనసాగుతుండడంతో ఆ పనుల్లో కొందరు బిజీగా ఉండి గ్రామాలకు హాజరుకావడం లేదు.

పారిశుద్ధ్య పనులకు విముఖత

అధికారుల పర్యవేక్షణ లేక.. కార్యదర్శులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, దీంతో గ్రామాల పరిపాలన అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మల్టీ పర్పస్ వర్కర్స్‌కు సైతం సక్రమంగా వేతనాలు ఇవ్వకపోవడంతో.. వారు పారిశుద్ధ్య పనులు చేసేందుకు విముఖత చూపుతున్నట్లు సమాచారం. గత సర్పంచ్‌ల కాలంలో పారిశుద్ధ్య కార్మికుల వేతనాలు విడుదల ఆలస్యం అయిన నేపథ్యంలో.. సర్పంచులు సైతం సొంత నిధులు వెచ్చించి పనులు చేయించేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదని పారిశుద్ధ్య కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిధులు రాక.. అప్పుతేలేక

15వ ఆర్థిక సంఘం నిధులు నాలుగు నెలలకు ఒకసారి జనాభా దామాషా ప్రకారం విడుదలవుతున్నాయి. కానీ అవి ట్రాక్టర్ కిస్తీలు(ఈఎంఐ), డీజిల్, కార్మికుల వేతనాలకు సరిపోవడం లేదని గ్రామ కార్యదర్శులు వాపోతున్నారు. దీంతో పంచాయతీల నిర్వహణ తమకు భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి నిధులు రావడం లేదని పేర్కొన్నారు. ఖర్చు చేసిన సొంత డబ్బు తిరిగి రాక, అప్పుతెచ్చి పెట్టలేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొంటున్నారు. అసలు అప్పు పుట్టడం లేదని వాపోతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదిక

గ్రామాల్లో సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. ప్రత్యేకాధికారులు వారి శాఖ విధులతో పాటు.. వారికి కేటాయించిన గ్రామ కార్యదర్శులతో సమన్వయం చేసుకుంటూ.. ప్రజా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. పంచాయతీలకు వెళ్లని అధికారులను గుర్తించి, ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తాం.

– సుభాషిణి, మండల ప్రత్యేకాధికారి, మహేశ్వరం

గ్రూప్–1 అభ్యర్థులకు సన్మానం



అధికారులను సన్మానిస్తున్న కార్పొరేషన్ సిబ్బంది

బడంగ్‌పేట్: గ్రూప్–1లో ర్యాంకు సాధించి, ఉన్నత స్థితికి చేరుకున్న ఇద్దరు అధికారులను సోమవారం ఘనంగా సన్మానించారు. కార్పొరేషన్‌లో సీనియర్ అసిస్టెంటుగా విధులు నిర్వహిస్తున్న అనూష.. సూర్యాపేట జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా, వార్డు ఆఫీసర్‌గా పనిచేస్తున్న కల్యాన్‌గౌడ్ హైదరాబాద్ కమర్షియల్ ట్యాక్స్ అధికారిగా ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఇరువురిని కార్పొరేషన్ సమావేశ మందిరంలో కమిషనర్ పి.సరస్వతి ఆధ్వర్యంలో సత్కరించారు. ఏఎంసీ జాన్ కృపాకర్, మేనేజర్ శ్రీధర్‌రెడ్డి, ఆర్‌ఓ వేణుగోపాల్, టీపీఎస్ కిరణ్‌కుమార్, వార్డు ఆఫీసర్లు, బిల్ కలెక్టర్లు, సిబ్బంది ఉన్నారు.



కందుకూరు: బతుకమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా.. సద్దుల బతుకమ్మ

సద్దుల బతుకమ్మ సంబురాలు సోమవారం ఘనంగా జరిగాయి. గడిచిన ఎనిమిది రోజులగా రోజుకో తీరుగా పూలగోపురాలను పేర్చి ఆడిపాడిన అతివలు.. ఆఖరు రోజు సోమవారం తీరొక్క పూలతో తీర్చిదిద్దిన పూల సింగిడిలను వీధుల్లో ప్రతిష్ఠించారు. బతుకమ్మ బతుకమ్మ ఉయ్యాలో.. అంటూ ఆటపాటలతో సందడి చేశారు. మళ్లొచ్చె ఏడాది రావమ్మ గౌరమ్మా.. అంటూ గంగమ్మ ఒడికి చేర్చారు. అనంతరం వాయినాలు ఇచ్చిపుచ్చుకొన్నారు.

–సాక్షి, నెట్‌వర్క్



మీర్‌పేట: చందన చెరువు వద్ద.. కమిషనర్ నాగమణి తదితరులు



బడంగ్‌పేట్: కార్పొరేషన్ వినాయకహిల్స్ కాలనీలో..



మీర్‌పేట: న్యూగాయత్రీనగర్ బతుకమ్మ వేడుకలో ఎమ్మెల్యే సబితారెడ్డి



తుక్కుగూడలో..



హుడాకాంప్లెక్: సీతామేదోస్ కాలనీలో

రోడ్డు పక్కకు ఒరిగిన లారీ



కుంగిన లారీ

తుర్కయంజాల్: ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి.. ఓ లారీ రోడ్డు పక్కకు ఒరిగింది. దారి సమాంతరంగా లేకపోవడంతోనే ఈ సంఘటన చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. సాగర్ రహదారి నుంచి సబ్‌స్టేషన్ మీదుగా తుర్కయంజాల్ గ్రామానికి వచ్చే రోడ్డును హెచ్‌ఎండీఏ నిధులతో ఆర్‌అండ్‌బి అధికారులు నిర్మించారు. నిర్మాణం పూర్తయి మూడు నెలలు అవుతున్నా.. రోడ్డుకు ఇరువైపులా సమాంతరంగా మట్టి పోయలేదు. దీంతో సోమవారం లోడ్‌తో వెళ్తున్న లారీ.. ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి రోడ్డు దిగువకు ఒరిగింది. డ్రైవర్ అప్రమత్తంగా వ్యవహరించడంతో ప్రమాదం తప్పింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును సమాంతరం చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పండుగకు ఊరెళ్తున్నారా.. జాగ్రత్త

విలువైన వస్తువులు ఇంట్లో ఉంచొద్దు: సీఐ



ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సీఐ

కందుకూరు: పండుగకు ఊర్లకు వెళ్లే వారు జాగ్రత్తగా ఉండాలని, ఇంట్లో విలువైన వస్తువులు ఉంచకుండా తగిన చర్యలు తీసుకోవాలని సీఐ సీతారామ్ అన్నారు. సోమవారం మండల పరిధి రాచులూరులో కమ్యూనిటీ పోలీసింగ్‌లో భాగంగా గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విలువైన వస్తువులను బ్యాంకు లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. ఇళ్లకు సీసీ కెమెరాలు, సెంటర్ లాక్‌లు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ఇంటి ముందర ముగ్గులు వేసేటప్పుడు, బయటకు వెళ్లేటప్పుడు మహిళలు తమ మెడలోని బంగారు ఆభరణాలు కనిపించకుండా చీరతో కప్పుకోవాలని కోరారు. ఇంటి ముందు తాళం కన్పించకుండా కర్టెన్ వేయాలన్నారు. అనుమానిత వ్యక్తుల సంచారం గమనిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మహేందర్, హెడ్ కానిస్టేబుల్ రాజు, పెట్రోల్ మొబైల్ ఇన్‌చార్జి శ్రీనివాస్, రవీందర్ పాల్గొన్నారు.

ఈగల మోత భరించలేక పోతున్నాం..



కార్యదర్శికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

కందుకూరు: ఈగల బెడదతో ఇబ్బంది పడుతున్నామని కొత్తగూడ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం పంచాయతీ కార్యదర్శికి వినతిపత్రం అందజేశారు. అనంతరం గ్రామస్తులు మాట్లాడుతూ.. కోళ్ల ఫారం వద్ద అపరిశుభ్రత కారణంగానే ఈగల మోత పెరిగిందని, దాంతో దుర్వాసన వస్తోందని పేర్కొన్నారు. తృప్తిగా భోజనం చేయలేక పోతున్నామన్నారు. పరిస్థితి ఇలాగే ఉంటే.. తమ ఆరోగ్యం దెబ్బతింటుందని వాపోయారు. వెంటనే వాటి నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ప్రకాష్ రెడ్డి, సంజీవరెడ్డి, యాదయ్య, ప్రభాకర్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, బి.హనుమంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, హన్మంత్‌రెడ్డి, ఎండీ అంజాద్, యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సదర్‌కు రూ.10 కోట్లు మంజూరు చేయాలి



మాట్లాడుతున్న మహేందర్‌యాదవ్

సైదాబాద్: రాష్ట్ర ప్రభుత్వం సదర్ ఉత్సవాలను అధికారిక పండుగగా గుర్తించటం అభినందనీయమని మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు చింతల రవీంద్రనాథ్ యాదవ్, సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.లక్ష్మణ్ యాదవ్ అన్నారు. సోమవారం సైదాబాద్ శ్రీప్రసన్నాంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మహాసభ సభ్యుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన తెలంగాణ రాష్ట్ర సదర్ ఉత్సవ సమితికి నూతన కమిటీని నియమించారు. అధ్యక్షుడిగా మైల్‌కోల్ మహేందర్ యాదవ్, ఉపాధ్యక్షులుగా హరిబాబు యాదవ్, లడ్డూ యాదవ్, చింతల సురేందర్ యాదవ్, రమేష్ యాదవ్, శాంతన్న యాదవ్, ప్రధాన కార్యదర్శులుగా శ్రీశైలం యాదవ్, శ్రీహరి యాదవ్, రవీందర్ యాదవ్, నాగ సీతారాములు, కోశాధికారిగా లక్ష్మణ్ యాదవ్‌లు నియమితులయ్యారు. ఈ సందర్భంగా మైల్‌కోల్ మహేందర్ యాదవ్ మాట్లాడుతూ.. సదర్ ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 10 కోట్లు నిధులు మంజూరు చేయాలని కోరారు.

దసరాలోపు చేనేత రుణాలు మాఫీ చేయాలి



గాంధీ విగ్రహానికి వినతిపత్రం ఇస్తున్న నాయకులు

మన్సూరాబాద్: దసరా పండుగలోపు చేనేత కార్మికుల రుణాలు మాఫీ చేయాలని మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు డిమాండ్ చేశారు. చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలు పరిష్కారించాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు వనం శాంతికుమార్ అధ్యక్షతన మన్సూరాబాద్ సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. చేనేత పరిశ్రమ, చేనేత కార్మికుల సమస్యలపై వివిధ సందర్భాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, చేనేత మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, కమిషనర్ శైలజారామయ్యార్ దృష్టికి తీసుకవచ్చి చర్చలు జరపటంతో ప్రభుత్వం హామీలు ఇచ్చిందని, ఇచ్చిన హామీలను ఇంతవరకు అమలు చేయలేదని మండిపడ్డారు. చేనేత పరిశ్రమకు బడ్జెట్‌లో రూ.2 వేల కోట్ల రూపాయాలు కేటాయించాలని కోరాగా కేవలం రూ.2 వందల కోట్లు కేటాయిస్తే సమస్యలు ఏలా పరిష్కారం అవుతాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో స్వామి, నరహరి, చంద్రశేఖర్, పెంటయ్య, శేఖరయ్య, వెంకటేశ్వర్లు, శ్రీశైలం, వెంకటేశం, కుమార్, రాములు, పురుషోత్తం పాల్గొన్నారు.



తుక్కుగూడ: సరస్వతిగా రావిర్యాల ఎల్లమ్మ



హుడాకాంప్లెక్స్: ఉమా మహేశ్వర ఆలయంలో చిన్నారులకు అక్షరాభ్యాసం



మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో..

సరస్వతీ నమోస్తుతే..

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి. ఎనిమిదో రోజు సోమవారం దుర్గామాత సరస్వతిదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆలయాలు, మండపాల్లో కొలువైన అమ్మవారికి నిర్వాహకులు వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య విశేషపూజలు, హోమం, అర్చనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

–సాక్షి, నెట్‌వర్క్



బడంగ్‌పేట్: అల్మాస్‌గూడ దుర్గామాత సన్నిధిలో భక్తులు



కందుకూరు: దుర్గామాత సన్నిధిలో చండీ హోమం



మహేశ్వరం: నాగారంలో..